ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025 5 శ్రీ సత్యసాయి





చెట్ల మీదనే వదిలేసిన అరటితోటను పరిశీలిస్తున్న నాయకులు

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

జిల్లాలోని అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి తోటలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా నాయకులు వి. శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్రతో కలిసి రాంభూపాల్ పరిశీలించారు. గిట్టుబాటు ధరలేక తోటల్లో పంటను వదిలేసిన రైతులతో వారు మాట్లాడారు. బాధిత రైతు హనుమంతు మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల్లో అరటి సాగు చేయడానికి ఐదున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటసాగు చేస్తే కేవలం 45వేల రూపాయలు మాత్రమే చేతికి వచ్చిందని వాపోయారు. మూడు ఎకరాల్లో పంట సాగు చేస్తే కూలీల ఖర్చు కూడా రాలేదని మరో రైతు చిన్న ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు రాకపోవడంతో మూడు ఎకరాల అరటి పంటను పొలంలోనే వదిలేశానని నారాయణస్వామి అనే రైతు వాపోయారు. అనంతరం సిపిఎం రాష్ట్రనాయకులు రాంభూపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు సాగు చేశారన్నారు. గిట్టుబాటు ధర లేక కోట్ల రూపాయల పెట్టుబడిని నష్టపోతున్నారని అన్నారు. కిలో 15 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఉద్యానవన హబ్ అని ప్రభుత్వాలు మాటలు చెప్పడమే తప్ప కష్టాల్లో ఉన్న రైతులవైపు కన్నెత్తి చూడడంలేదన్నారు. గత సంవత్సరం నవంబరు నెలలో కిలో అరటి 22 రూపాయలు వుంటే, ప్రస్తుతం రెండు నుండి మూడు రూపాయలకు కొనే వారు లేరన్నారు. జిల్లావ్యాప్తంగా అరటి రైతులు దాదాపు 700 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి పెడితే అందులో పావు భాగం కూడా తిరిగి రాకపోతే రైతులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక చేతికొచ్చిన పంటను గొర్రెలు పశువుల మేతకు వదిలేస్తున్నారన్నారు. అరటిరైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తే కిలో ఆరు రూపాయలకు తగ్గకుండా కొనాలని కలెక్టర్ వ్యాపారులను ఆదేశించారని అయితే పంట కొనేవారు మాత్రం లేరని అన్నారు. మన జిల్లా అరటి గల్ఫ్ దేశాలకు ఎగుమతయ్యే స్థితి నుండి రోడ్లపై వేసే స్థితికి దిగజారిందన్నారు.. మోడీ ప్రభుత్వం ట్రంపు ఆదేశాలకు తలొగ్గి ఎగుమతులను నిలిపివేయడంతో పొగాకు, పత్తి, అరటి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ అరటి రైతులను ఆదుకునే దిశగా జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు చొరవచూపాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను భ్రమల్లో పెట్టి వారినోట్లో దుమ్ము వేస్తోందన్నారు. ఈ సంవత్సర కాలంలో 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం వెంటనే జిల్లాల్లో అరటిపంటను టన్ను 15 వేల రూపాయలకు తగ్గకుండా కొనాలని అందుకు తగిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జీవితం మానవాళికి మార్గదర్శకం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్



సత్యసాయి మహాసమాధి వద్ద మహారాష్ట్ర ముఖ్యమంత్రి, తదిత రులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి బాబా జీవితం ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా మారిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పేర్కొన్నారు. పుట్టపర్తిలో నిర్వహిస్తున్న సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్ పాల్గొన్నారు. పుట్టపర్తికి వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం మహారాష్ట్ర నుండి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రికి కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ బిజెపి నాయకులు ఎస్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పుట్టపర్తి విమానాశ్రయం నుండి నేరుగా ఆయన ప్రశాంతి నిలయం. చేరుకున్నారు. సాయి కుల్వంత్ హాల్‌లో త్యసాయిబాబా మహాసమాధిని దర్శించు కొన్నారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆటో రిక్షాలు పంపిణీ : శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వంద మంది లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు. శ్రీ సత్యసాయి జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఒడిస్సా గవర్నర్ హరిబాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ ,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు ఇతర ప్రముఖులతో కలిసి లబ్ధిదారులకు ఆటో రిక్షాలను పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, రామారావు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిస్సా గవర్నర్‌కు ఘన స్వాగతం : సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి వచ్చిన ఒడిస్సా గవర్నర్ కంభంపాటి డా .హరిబాబుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సన్మానించారు. బాబా వేడుకల సందర్భంగా శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యువ సమ్మేళన సదస్సులో పాల్గొనేందుకు ఆయన విచ్చేశారు. అందులో భాగంగా పుట్టపర్తి శ్రీనివాస విశ్రాంతి భవనంలో ఉన్న గవర్నర్ కంభంపాటి డా.హరిబాబు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,బిజెపి నేత కేంద్ర యువ కేంద్ర కో ఆర్డినేటర్ సోమగుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, టీడీపీ,బిజెపి జనసేన ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళన ప్రపంచ సదస్సు : సత్య సాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సత్య సాయి గ్లోబల్ కౌన్సిల్, శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రెండవ రోజు జరిగిన యువసమ్మేళన ప్రపంచ సదస్సులో 45 దేశాల నుండి 2500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

సరాస్ మేళా : గ్రామీణ కళాకారులను, మహిళా సంఘ సభ్యుల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవడానికి 'సరాస్'జాతీయస్థాయి మేళా ఎంతో ఉపయోగపడుతుందని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పేర్కొన్నారు. సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మొట్టమొదటిసారిగా సత్యసాయి జిల్లాలో సరాస్ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామీణ కళాకారుల, సంఘం మహిళా సంఘాల యొక్క వ్యాపారాలు, అమ్మకాల కోసం 300 రకాల ఉత్పత్తులతో 80 స్టాళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ స్టాళ్లను ఈనెల 15 నుండి 25వ తేదీ వరకు నిర్వహించనున్నామని వివరించారు.





స్టాళ్లలో ప్రదర్శించిన కళాకృతులు

ఇష్టపడి చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు కరిష్మా



ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని...అప్పుడే చదివిన చదువు గుర్తుంటుందని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు సూచించారు. మార్చినెలలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పదవ తరగతి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు శుక్రవారం పాంచజన్య పాఠశాల ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ జక్క నరేంద్ర, సర్జన్ రష్మీ, గైనకాలిజిస్టు డాక్టర్ కరీష్మాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పాఠశాల తరపున అందించారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు ఆరోగ్యానికి మించిన సంపద లేదన్నారు. పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వైద్యులు రష్మి, కరీష్మాలు విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.ఎస్. నంద కుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్ర నాయక్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చంద్ర నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్ర నాయక్ పేర్కొన్నారు. హిందూపురం డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా శుక్రవారం చంద్ర నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎడిలు, ఏఈలతో పాటు ఉద్యోగులు ఆయనను కలిసి పుష్ప గుచ్చం అందించి అభినందించారు. అనంతరం చంద్ర నాయక్ మాట్లాడుతు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. యావత్ సిబ్బందిని ఏకతాటిపై తీసుకొచ్చి విద్యుత్ శాఖ రెవెన్యూ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి బాలాజీ యలమంజుల పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఎన్నికల నేపథ్యంలో బరిలో ఉన్న బాలాజీ శుక్రవారం హిందూపురంలో న్యాయవాదులను కలిసి మద్దతు అభ్యర్థించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సుదర్శన్, రాజశేఖర్, సిద్దు, శివశంకర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అంతరం బాలాజీ సీనియర్ న్యాయవాదులతో పాటు జూనియర్ న్యాయవాదులను కలిసి ఎన్నికల్లో తనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసాద్ రెడ్డి, కృష్ణమూర్తి, జగదీష్, సందీప్, పవిత్ర, భాగ్యలక్ష్మి, షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ, ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి బాబా శతజయంతోత్సవాల నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పుట్టపర్తికి రానున్నారు. ఈనేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం విచ్చేసిన, ట్రైనీ ఐపీఎస్ లతోపాటు, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పిలు, సిఐ, ఎస్ఐలతో అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోసి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో పాటు , సీఎం చంద్రబాబు సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు హాజరవుతారన్నారు. అదేవిధంగా 23న ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో జరిగే కార్యక్రమాలలో కూడా ఉపరాష్ట్రపతి ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయంలో బందోబస్తు ఏర్పాట్లు, కాన్వాయ్ వెళ్లే రోడ్డు మార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. విమానాశ్రయం నుండి వెళ్లే రోడ్డు మార్గం కాన్వాయి, పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ హాల్ వెళ్లే సమయంలో బందోబస్తు నిమిత్తం ఏర్పాటు చేసిన పాయింట్లలో జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. విమానాశ్రయం దగ్గర కాన్వాయ్, పబ్లిక్ గ్యాలరీలు, పార్కింగ్ ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రతి ఒక్కరినీ డి ఎఫ్ ఎం డి ద్వారా తనిఖీలు చేసి లోపలికి పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ లు , అడిషనల్ ఎస్పీలు , డిఎస్పీలు,సిఐలు, ఆర్ ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

టిప్పు సుల్తాన్‌కు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

టిప్పు సుల్తాన్‌ను ఆదర్శంగా తీసుకొని దేశ భద్రత కోసం యువకులు ముందకు రావాలని పట్టణ సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం పిలుపునిచ్చారు. టిప్పు సుల్తాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పట్టణంలోని గుడ్డం ఆటో స్టాండ్ లో టిప్పు సుల్తాన్ అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐలతో పాటు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, జామీయ మసీదు ముత్వల్లీ అస్లాం, ఎస్‌డిజిఎస్ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మాలీక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి శ్రీరాములు, కొల్లకుంట అంజి, ఎరుకుల హక్కుల సంఘం వెంకట రమణ, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మూర్తి, టిప్పు అభిమాన సంఘం నాయకులు అన్సార్, ఉమర్, సాఖీబ్, అల్లు, ఇమ్రాన్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిఐలు, నాయకులు, యువకులు

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపు..!

18 నెలలైనా తెరుచుకోని వెబ్‌సైట్
నాయకుల హామీలు నీటి మూటలేనా
వృద్ధులు, కళాకారులు, కార్మికులు పెదవివిరుపు

ప్రజాశక్తి-పెనుకొండ

'కన్న బిడ్డలు పట్టించుకోక.. అయిన వారి ఆదరణ లేక.. వయస్సు మీద పడి పని చేసే సత్తువ లేక.. సర్కారు ఇచ్చే పింఛను డబ్బులతో జీవనం సాగిద్దాం అనుకున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, కళాకారులు, కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇచ్చే కాస్తో.. కూస్తో పింఛను డబ్బులే వారికి జీవనాధారం.. అలాంటి పింఛన్లు కూడా రాకపోవడంతో వారి జీవనం దుర్భరమైంది. కొత్త ప్రభుత్వంలో తమకు కాస్త ఆసరా ఉంటుందని ఆశపడ్డారు. అయితే ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలైనా కొత్త పింఛన్ల మంజూరు ఊసేలేదు. నూతన పింఛన్ల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలకు మందులు కొనే స్థోమత లేక.. చేతిలో డబ్బుల్లేక.. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండగా నూతన పింఛన్లపై ప్రభుత్వ ప్రకటన కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్త పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని వృద్ధులు, కార్మికులు, ఒంటరి మహిళలు వేడుకుంటున్నారు.



కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త ఫింఛన్లు మంజూరు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఆర్భాటంగా చెప్పారు. దీంతో 60 ఏళ్లు నిండిన అర్హులైన వృద్ధులు, కల్లుగీత కార్మికులు, కళాకారులు, తదితర వర్గాలకు చెందిన వేలాది మంది నూతన పింఛన్ల ప్రకటన కోసం వేచి ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలైనా కొత్త పింఛన్ల మంజూరుపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.

రెండేళ్లుగా తెరుచుకోని వెబ్‌సైట్

అర్హులైన వృద్ధులు, వితంతువులు, కళాకారులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే వెబ్‌సైట్ రెండేళ్లుగా తెరచుకోలేదు. 2023 అక్టోబర్ వరకూ అందిన పింఛన్ల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు అప్పటి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. 2023 నవంబరు నుంచి ఆ వెబ్‌సైట్ పూర్తిగా మూసివేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. 18 నెలలు అవుతున్నా ఆ సైట్‌ను తిరిగి ప్రారంభించే చర్యలు తీసుకోవడం లేదని అర్హులు వాపోతున్నారు. నూతన పింఛన్లు ఎప్పుడిస్తారన్న ప్రశ్నకు నాయకుల నుంచి సరైన సమాధానం రావడం లేదు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 6 వేల మందికి పైగా అర్హులు నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎదురుచూస్తున్నట్లు అంచనా.

డబ్బుల్లేక.. మందులు కొనలేక..

వృద్ధులు, నిరుపేద కళాకారులు, కల్లుగీత కార్మికులు, అనారోగ్యానికి గురై కన్నబిడ్డల ఆదరణ నోచుకోని వారు డబ్బుల్లేక.. మందులు కొనలేక బతుకు భారంగా వెళ్లదీస్తున్నారు. పింఛను వస్తే ఆరోగ్యానికి మందులు కొనేవారమని, పోషణకు, మందులకు కన్నబిడ్డల వద్ద చేయి చాచలేక రోజు గడిస్తే చాలనే భావనలో చాలా మంది ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు ముందు..

2026 ప్రారంభంలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాదేశిక నియోజక వర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటన చేసింది. ఎన్నికల ప్రకటనకు ముందైనా ప్రభుత్వం కనికరిస్తుందనే చిన్నఆశ ఇప్పుడిప్పుడే తలెత్తుతోంది. 2023 నవంబర్ నుంచి 2025 సెప్టెంబర్ వరకూ సుమారు 20 నెలలకు పైగా గడిచింది. అర్హత ఉన్న వారి మొర ఆలకించి వెబ్‌సైట్ తెరవాలని ఆయావర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా ..



అన్ని అర్హతలు ఉన్నాయి. వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా. కూటమి ప్రభుత్వం వెంటనే దరఖాస్తులు స్వీకరించాలి. వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలకు భరోసా కల్పించాలి.

- ముత్యాలమ్మ వృద్ధురాలు, మరవపల్లి, పెనుకొండ

వెబ్ సైట్ తక్షణం తెరవాలి..



రెండేళ్లుగా మూతపడిన వెబ్ సైట్‌ను తక్షణం తెరవాలి. అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తు తీసుకుని పింఛను మంజూరు చేయాలి. ఆయా వర్గాలకు లబ్ధి కల్పించాలి. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న వృద్ధులు, కార్మికులు, ఒంటరి మహిళలకు కూటమి ప్రభుత్వం చేయూతనివ్వాలి.

- హరి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

మాక్ అసెంబ్లీకి ఎంపికైంది ఒకరు.. జాబితాలో మరొకరు..!

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిలో ప్రతి నియోజకవర్గం నుంచి ఒకరిని మాక్ అసెంబ్లీకి ఎంపిక చేశారు. ఈ క్రమంలో కదిరి నియోజకవర్గంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచి మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. మండల పరిధిలో 4 ఉన్నత పాఠశాలలు ఉండగా పోటీలకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వారిలో వైష్ణవి ప్రథమ స్థానంలో, గూటిబైలు జడ్పీ హైస్కూల్ విద్యార్థి లిఖిత్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. దీంతో వైష్ణవిని మాక్ అసెంబ్లీకి ఎంపిక చేయడంతో పాటు ఎంఇఒ గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు సన్మానించారు. అయితే తీరా మాక్ అసెంబ్లీకి ఎంపికైన వారి జాబితాలో గూటిబైలు జడ్పీ హైస్కూల్ విద్యార్థి లిఖిత్‌రెడ్డి పేరు వచ్చింది. దీంతో బాధిత విద్యార్థిని వైష్ణవి, ఆమె తల్లిదండ్రులు శేషాద్రినాయుడు, లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గూటిబైలు జడ్పీ హైస్కూల్ లో ఓ విద్యాధికారి భార్య హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తుండడంతోనే పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన లిఖిత్‌రెడ్డి పేరును మాక్ అసెంబ్లీకి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా గమనించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నువ్వే అసెంబ్లీకి వస్తావని వైష్ణవికి ట్విట్టర్ వేదికగా హామీ ఇచ్చారు.

ట్విట్టర్‌లో స్పందించిన మంత్రి నారా లోకేష్



తమ కూతురుకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు

ప్రజాశక్తి
www.prajasakti.com

26న రైతుల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతుల సమస్యలపై ఈ నెల 26వ తేదీ పుట్టపర్తిలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపి రైతు సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎపి రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహాదేవ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గిరీష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఢిల్లీ రైతాంగ ఉద్యమం 5వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ రైతుల సమస్యలపై పుట్టపర్తిలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, పట్టు రైతులకు ఇన్సెంటివ్స్, అరటి రైతులకు నష్ట పరిహారం, బలవంతపు భూసేకరణ ఆపాలని, భూములు సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని, పాడి పరిశ్రమను ఆదుకోవాలని, తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి, సహాయ కార్యదర్శి ఆలకుంట మారుతి, సిఐటియు నాయకులు ఆదినారా యణ, వ్యవసాయ కూలీ సంఘం నాయకులు బాలస్వామి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఎపి రైతు సంఘం నాయకులు

రేపు జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలు : జెవివి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఈ నెల 23వ తేదీ పట్టణంలోని గ్లోబల్ జెన్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎంకె.నబి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి ఒక్కో టీమ్ జిల్లా స్థాయి పరీక్షకు హాజరుకావాలని కోరారు. విజేతలకు బహుమతులతో పాటు హాజరైన ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం, ప్రతి పాఠశాలకు జ్ఞాపిక అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో జట్టును మాత్రమే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆ పరీక్షలకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరవుతారని, జెవివి కార్యకర్తలు, ముఖ్యులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు. విద్యార్థుల హాజరు పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.

సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ మార్కెట్ యార్డ్‌లో పని చేస్తున్న సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్.బాషా, అయుబ్‌ఖాన్ పాల్గొన్నారు. ఓబులు మాట్లాడుతూ జిల్లా సివిల్ సప్లై హమాలీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, పిఎఫ్ అమలు చేయాలని, ఈఎస్ఐపై కోర్టులో ఉన్న కేసును త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, స్వీపింగ్, తాగునీరు సరఫరా బిల్లులు చెల్లించాలని, హమాలీల పట్ల నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. లేనిచో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నాయకులు నేలకోటప్ప, లక్ష్మన్న, కదిరప్ప, హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి సవిత ఆదేశించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి నాయకుడి బాధ్యత అన్నారు. ప్రజలకు వాటి ప్రయోజనాలు, సమగ్రంగా అందుతున్నాయా లేదో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అమలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాన్నారు. సోషల్ మీడియా వేదికగా వైసిపి చేసే తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌లో 87 అర్జీలు

మడకశిర టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో మొత్తం 87 అర్జీలు అందాయి. ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందులో ఎక్కువగా రైతుల భూ సమస్యలు, వన్-బి, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకం, నూతన గృహాలు, ఆసుపత్రి బిల్లులు, తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే ఆయా అర్జీలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, సింగిల్‌విండో అధ్యక్షులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-బుక్కపట్నం

భగవాన్ శ్రీసత్యసాయి సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సింగపూర్‌కు చెందిన సత్యసాయి భక్తులు కోరారు. మండలంలోని కృష్ణాపురం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సత్యసాయి భక్తులు 50 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే ఉచిత తాగునీటి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సత్యసాయిబాబా మార్గం సేవా మార్గం అన్నారు. దేశ విదేశాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగించిన మహనీయులు సత్యసాయి అన్నారు. ఆయన స్ఫూర్తితో తమ వంతుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమం లో సింగపూర్‌కు చెందిన సత్యసాయి భక్తులు, గ్రామస్తులు అప్పస్వామి, జగదీశ్‌స్వామి, లింగప్పగారిపల్లి హరి, లక్ష్మీనారాయణ, రెడ్డప్ప, సుబ్బరాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపిడిఒ పోలప్ప, వారి సిబ్బంది జెసిబి ఏర్పాటు చేయించి రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగించారు. పట్నం గ్రామ పంచాయతీ అధికారి, గ్రామ అధ్యక్షులు, టిడిపి నాయకులు కలిసి గ్రామ పంచాయతీ పరిధిలోని మాచిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు రోడ్డుపై గుంతలు పుడ్చారు. ముళ్లపొదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి అధికారులను ఆదేశించినట్లు కూటమి నాయకులు తెలిపారు.

వాటర్‌ప్లాంట్లు ప్రారంభం

ప్రజాశక్తి-గుడిబండ

సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆర్థికసాయంతో స్థానిక మహాత్మజ్యోతిబాపూలే బిసి బాలికల జూనియర్ కళాశాల, రొళ్ల కెజిబివిలో (రూ. 3.4 లక్షల వ్యయంతో) వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిని శుక్రవారం ఆర్‌బిఐ మాజీ రీజినల్ డైరెక్టర్ ఎస్ఎంఎన్.స్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు జె.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మా ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ వై.లక్ష్మీనారాయణ, విద్యాసంస్థల ప్రిన్సిపల్ మంజుల పాల్గొన్నారు.

'లక్ష దీపోత్సవం' పోస్టర్ ఆవిష్కరణ

అమరాపురం : మండలంలోని హేమావతి ఎంజేరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 4వ తేదీ లక్ష దీపోత్సవం, పూలరథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మడకశిర పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మండలంలోని కొడికొండ జడ్పీ హైస్కూల్‌లో సేవా కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇంగ్లీష్ టీచర్ పి.సాయిలీల విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. 250 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్కెచ్ పెన్నులు, ఎరేజర్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నంజుండప్ప, ఉపాధ్యాయులు కళావతి, వాణి, ఆసిపుల్లా, ధనశేఖర్, పుష్పలత, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అనుబంధ కమిటీ అధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి-చిలమత్తూరు

టిడిపి అనుబంధ మండల కమిటీలకు నియమితులైన కొత్త అధ్యక్షులను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే బాలకష్ణ పిఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు మురళీ, బిసి సెల్ అధ్యక్షుడు అంజి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, మహిళా విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి, టిఎన్ఎస్ఎఫ్ హరి, మైనార్టీ అధ్యక్షుడు గౌస్ బాషాలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రంగారెడ్డి, బేకరి గంగాధర్, బాలాజీ, మల్లికార్జున, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అనుబంధ కమిటీ కొత్త అధ్యక్షులకు సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తిలో భూ పరిపాలన కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్ల పాల్గొనడానికి శుక్రవారం సాయంత్రం రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ జి.జయలక్ష్మి పుట్టపర్తికి చేరుకున్నారు. ఆమెకు ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్ వద్ద జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి ఎం.మౌర్యభరద్వాజ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆమెకు శతజయంతి ఉత్సవాల నిర్వహణ తీరు, ఏర్పాట్లు, ఈ నెల 22వ తేదీ పుట్టపర్తికి వస్తున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ఇతర ప్రముఖుల పర్యటనల గురించి వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆమె వారికి పలు సూచనలు చేశారు. వారి వెంట పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



కమిషనర్ జయలక్ష్మికి పూలబొకే ఇస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని మొలకవేముల క్రాస్‌లో శుక్రవారం ఎంపిడిఒ శకుంతల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగహన కల్పించారు. అలాగే ఈ గవర్నెన్స్ మన మిత్ర యాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలు ఇంటి వద్దనే పొందవచ్చు అని చూపించారు. అనంతరం టీ స్టాల్స్ హోటల్స్, జనరల్ స్టోర్స్‌ను పరిశీలించి ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేయాలని ఆదేశించారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-తలుపుల

తలుపుల మేజర్ పంచాయతీలోని కుమ్మరపేటలో నివాసం ఉంటున్న టిడిపి కార్యకర్త హుస్సేన్ మియా శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే టిడిపి మండల కన్వీనర్ ముబారక్ మతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు రూ. 10 వేల అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, రామ్మోహన్, అలీ, వెంగముని, నాగరాజు, డ్రైవర్ సాయి, అస్లాం, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనిచో చర్యలు తప్పవని కదిరి ఐసిడిఎస్ సిడిపిఒ రాధిక హెచ్చరించారు. తలుపుల, నంబులపూలకుంట సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న అంగ న్వాడీ హెల్పర్లకు శుక్రవారం ప్రాజెక్ట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని, అంకితభావంతో విధులు నిర్వహించాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. పిల్లలను ఇంటి వద్ద నుంచి అంగన్వాడీ కేంద్రానికి తీసుకొచ్చి తిరిగి వారి ఇంటి వద్దకు చేర్పించాల్సిన బాధ్యత పూర్తిగా అంగన్వాడీ సిబ్బందే అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు నిహారిక, దీప, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని నీలం సంజీవరెడ్డి ఒరింటల్ పాఠశాల, జూనియర్ కాలేజీ, జడ్పీ ఉర్దూ పాఠశాలలను శుక్రవారం ఎడి-2 వినయ్‌మోహన్ సందర్శించారు. మధ్యాహ్నం భోజనం రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందివ్వాలన్నారు. మెనూ తప్పక పాటిం చాలన్నారు. మెనూ పాటించని ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, హెచ్ఎం గిరి ఉన్నారు.

ఆటో బోల్తా.. దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని దొరిగల్లు ఘాట్‌రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు.. మహబూబ్‌జాన్, ఆమె భర్త బాబా ఫక్రుద్దీన్ ఆటోలో వేంపల్లి నుంచి ముదిగుబ్బకు వస్తుండగా మార్గమధ్యలో టిఎన్ పాల్యం క్రాస్ ఘాట్ రోడ్డులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా ముదిగుబ్బ 108 సిబ్బంది ఈఎంటి మల్లేష్, పైలెట్ నారాయణస్వామినాయక్ వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను పులివెందుల ఆసుపత్రికి తరలించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



అంతర్జాతీయ క్రీడా పోటీలకు చందుప్రియ

కొత్తచెరువు : కొత్తచెరువుకు చెందిన అప్పన్నగారి చందుప్రియ అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రెజ్లింగ్ అండ్ గ్రాప్లింగ్ జాతీయ స్థాయి పోటీల్లో చందుప్రియ ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించింది. ఆమె డిసెంబర్ 6, 7 తేదీల్లో జరిగే బ్యాంకాక్, థాయిలాండ్ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని కోచ్‌లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు..

రొద్దం : మండలంలోని తురకలాపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంగప్ప, పిడి రామకృష్ణ తెలిపారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో అండర్-14 బాల, బాలికల సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో తురకలాపట్నం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బి.చైతన్, ఈ.రామ్, బేస్ బాల్ పోటీల్లో 7వ తరగతి విద్యార్థి రాకేష్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు కడప జిల్లా పులివెందులలో నవంబర్ 22, 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, పిడి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తురకలాపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తాడిమర్రి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

తాడిమర్రి : మండలంలోని దాడితోట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పి.మహేష్‌బాబు, పిఇటి కె.జయలక్ష్మి తెలిపారు. ఇటీవల అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఐదుగురు విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-17 బేస్‌బాల్ టీంకు కె.అక్షయ, అండర్-14 బేస్‌బాల్ టీంకు ఎస్.ఇంతియాజ్, అండర్-14 సాఫ్ట్‌బాల్ టీంకు డి.అభిరామ్, బాలికల టీంకు వి.మైథిలి, ఈ.కస్తూరి ఎంపికయ్యారని తెలిపారు. వారిని హెచ్ఎం, పిఇటి, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

హాకీ పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థులు

ధర్మవరం రూరల్ : పట్టణంలోని జీవనజ్యోతి స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సిస్టర్ సుజాత తెలిపారు. ఇటీవల అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలోలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు ఎస్.విక్కీ, ఆర్.వరుణ్, వి.గుణశ్రీ ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-14 హాకీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 22 నుంచి 24వ తేఈ వరకూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం సుజాత, కరస్పాండెంట్ సిస్టర్ రిన్సీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



హాకీ పోటీలకు ఎంపికైన 'జీవనజ్యోతి' విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో తిరుపతిలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. నాగార్జున మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఆ మహాసభ లో రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, విద్యారంగం అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తారన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, బుక్కపట్నంలో ఆగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని, పుట్టపర్తిలో సత్యసాయి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలని, జీవో 117 రద్దు చేసి స్కూల్స్ మూసివేతను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ విద్యారంగాన్ని గాలికి వదిలేశారని, యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమన్, శ్రీనాథ్, యూనస్, అఖిల్, ఇమ్మానుయేల్, ప్రణీత్, కృష్ణ, పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు 'ఉపాధి' గ్రామసభలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22వ తేదీ నిర్వహిస్తున్న ఉపాధి హామీ గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ సాయి మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ, తొలగింపు, చేర్పులు, ఈకేవైసీ, తదితర వాటితో పాటు గ్రామంలో గుర్తించిన పనులపై చర్చిస్తామన్నారు. అలాగే ఉపాధి హామీ శ్రామికులు పనులు చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అమరాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామారావు, ఉపాధి హామీ సహాయ పథక సంచాలకులు శివన్న తెలిపారు. జాబ్ కార్డు ఉండి పనులకు హాజరు కాని వారు, వలస వెళ్లిన కుటుంబాలపై గ్రామసభలో చర్చించి శాశ్వతంగా తొలగిస్తామని తెలిపారు.

బాడీ బిల్డర్లు దేశ ప్రతిష్టను పెంచారు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఇటీవల ఇండోనేషియాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ విభాగాల్లో గెలుపొందిన భారతీయ బాడీ బిల్డర్లను ఎమ్మెల్యే, బాడీ బిల్డింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. లోటస్ జిమ్ నిర్వాహకులు, బాడీ బిల్డర్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఓ జిమ్ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండోనేషియాలో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో తమిళనాడుకు చెందిన శర్వనన్ మణి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ప్రతిష్టాత్మక 'మిస్టర్ యూనివర్స్' టైటిల్‌ను సాధించారన్నారు. క్రీడాకారులు అత్యధిక మెడల్స్ సాధించి దేశ కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఇండియన్ బాడీబిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు స్వామి రమేష్ కుమార్ నాయకత్వంలో ఈ ఘన విజయాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ తరపున మరెన్నో పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ది ఆంధ్ర బాడీ బిల్డర్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు శ్రీనివాసరాజు, గల్లా శ్రీనివాస్, జగన్, తదితరు లను అభినందించారు. అనంతరం జిమ్ సభ్యులకు మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో జిమ్ సభ్యులు డాక్టర్ జానకిరామ్, సురేష్‌కుమార్‌రెడ్డి, హనీష్, పివిఆర్ గణేష్, షామీర్, నూర్ మహమ్మద్, గౌస్, ఓబుల్‌రెడ్డి, లోటస్ జిమ్ సిబ్బంది జాఫర్, దివ్యాంత్, దీపక్, సాంబశివ పాల్గొన్నారు.



జిమ్ సెంటర్‌లో కేక్‌కట్ చేస్తున్నఎమ్మెల్యే కందికుంట

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నల్లచెరువు : మండలంలోని కమ్మవారి పల్లి గ్రామంలో దాదం శివారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన చేసి 41 రోజులు పూర్తయింది. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ గ్రామం వెళ్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గ టిడిపి కమిటీలో చోటు

ప్రజాశక్తి-అమరాపురం

మడకశిర నియోజకవర్గ టిడిపి అనుబంధ కమిటీల్లో మండల నాయకులకు చోటుదక్కింది. నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త మారుతిప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా హోటల్ సిద్దేశ్వర, లీగల్ సెల్ అధ్యక్షుడిగా లాయర్ హేమావతి కృష్ణమూర్తిలకు అవకాశం దక్కింది. వారు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.





న్యాయవాదుల సమస్యల పరిష్కారాని కృషి

ప్రజాశక్తి-పెనుకొండ

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హైకోర్టు న్యాయవాది ఎలమంచిలి బాలాజీ తెలిపారు. బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యునిగా పోటీ చేస్తున్న బాలాజీ శుక్రవారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆయన న్యాయవాదుల ఓట్లు అభ్యర్థించారు. వెల్ఫేర్ స్టాంప్ ఫీజు, సీనియర్ న్యాయవాదుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మహిళా న్యాయవాదులకు ఉచిత ఇన్సూరెన్స్, తదితర సమస్యలను న్యాయవాదులు ప్రస్తావించగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని బాలాజీ హామీ ఇచ్చారు. సమావేశం లో సీనియర్ న్యాయవాదులు నాగార్జున, విశ్వనాథ్, ఎం.శ్రీనివాసులు, అబూబకర్, హైకోర్టు న్యాయ వాది రాజ్‌కమల్, మోహన్‌నాయక్, శరత్‌బాబు, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, రాజేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'శాంతినికేతన్'లో ఆర్ట్, క్రాఫ్ట్ ప్రాజెక్ట్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్స్‌ను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఎల్‌కెజి, యుకెజి, 3, 4, 5 తరగతుల విద్యార్థుల చేత ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్స్ ఏర్పాటు చేయించినటు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఎం జె.అరుణ తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంఇఒ రాఘవయ్య, ఎం.సుధాకర్ హాజరై ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్స్‌ను ప్రారంభించారు. ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఇలాంటి ప్రాజెక్టులు మంచి అవకాశమని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఘనగిరి, సిద్ధార్థ, బ్రిలియన్స్, ప్రగతి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక వేషధారణలో అలరించిన విద్యార్థులు

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION); PENUKONDA
I.A.141/2025 in I.A.142/2025 in I.A.143/2025 in I.A.364/2024 in I.A.365/2024 in A.S.03/2021

Between:
M.Ramakrishna Reddy and others ...Petitioners-Appellants
AND
M.Chinnapa Reddy (died) and others... ...Respondents-Respondents

NOTICE TO THE RESPONDENTS/ DEFENDANTS NO.8 TO 10

R8:- Prameelamma w/o N.Narayana Reddy, 65 years, Sinecure,
R9:- Obula Reddy s/o N.Narayana Reddy, 40 years, agriculturist,
R10.:- Govinda Reddy s/o N.Narayana Reddy, 38 years, agriculturist,
No.8 to 10 are residents of Guntipalli village, Gorantla (M).

వాదులు మీ పైన అప్పీలు కొరకు పై దావా కోర్టు నందు వేసినారు. అందులో మిమ్మలను **I.A.141/2025 in I.A.142/2025 in I.A.143/2025 in I.A.364/2024 in I.A.365/2024 in A.S.03/2021** క్రింద ప్రతివాదులుగా చేర్చు అర్జీలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీకు చేరి ఉండలేదు. కావున ఈ ప్రకటన చూసిన అనంతరం పై కోర్టు నందు 28-11-2025 వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయి ఏవైనా అక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానిచో మీ పరోక్షము నందు దావా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

వాయిదా తేది:28-11-2025
(By Order of the Court)
సి.ఆర్.నాగర్జున, ఎం.ఏ.ఎం.ఎల్,
అడ్వకేట్,
పెనుకొండ, అనంతపురము జిల్లా

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.139/2023 in I.A.138/2023 in I.A.136/2023 in O.S.No.246/2008

Between:
దిన్నెపాటి చంద్రశేఖర్ రెడ్డి Died by LR's
పిటిషనర్స్ 2 టు 5
2.డి.సరోజమ్మ ...Petitioners/వాదులు
3.డి.హరినాథ్ రెడ్డి
4.డి.రఘునాథ్ రెడ్డి
5.బి.నాగలక్ష్మమ్మ ...Proposed/Plaintiff 2 to 5
AND
1.బి.లక్ష్మీనారాయణ రెడ్డి Died by LR's ప్రతివాదులు 3 to 6
2.కె.రాజా రెడ్డి Died by LR's 7 to 12
...Respondents/ ప్రతివాదులు
...Proposed Defendants 7 to 12

7 నుండి 12 వ ప్రతివాదులకు IA నోటీసులు

R7: కర్ణము శ్యామలమ్మ W/o రాజారెడ్డి
R8: కర్ణము సుగుణమ్మ D/o రాజారెడ్డి
R9: కర్ణము సుమంగళ D/o రాజారెడ్డి
R10: కర్ణము రేఖా
R11: కర్ణము మహిధర్ రెడ్డి as 7yrs S/o ధనుంజయ రెడ్డి
R12: కర్ణము వర్షిత D/o కర్ణము ధనుంజయ రెడ్డి Age 54 years Minors - Rep by Mother కర్ణము రేఖా కమ్మవారిపల్లి H/o నల్లచెరువు నల్లచెరువు మండలం శ్రీ సత్యసాయి జిల్లా.

అను మీ పైన వాదులు అయినటువంటి సరోజమ్మ, హరినాథ్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగరత్నమ్మ దావాలో మిమ్మలను చేర్చుటకు పై వారి కోర్టు నందు పిటీషనరు అర్జీలు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తం, పై వారి కోర్టునందు 10-12-2025 తేదీన వాయిదా ఉన్నాది. సదరు వాయిదా తేదీ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని, ఉదయం 10:30 గంటలకు పై వారి కోర్టునందు హాజరు కావలయును అట్లు హాజరు గాని యెడల, మీ పరోక్షంలో తీర్మనం చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 10/12/2025
స్థలం:కదిరి ఇట్లు
వి.ప్రసాద్ రెడ్డి, B.A.B.L..,
కె. గంగాధర, B.com.B.L,
పిటీషనర్‌తరపు న్యాయవాదులు, కదిరి